# సాక్షి
# చిత్తూరు

బుధవారం। 15। నవంబర్। 2023






## నేనొస్తున్నాని..శుభ్రం చేశారా?

'నేనొస్తున్నాని.. ఆస్పత్రిని శుభ్రం చేశారా?' అని జిల్లా ఆస్పత్రి నిర్వాహకులను ఏపీవీపీ కమిషనర్ వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. - 8లో



## ఆనందం తోడుగా..చిన్నారుల వేడుక

చిత్తూరు నగరంలోని పలు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. - 8లో



## ఎర్రాతివారిపల్లెలో కేంద్ర బృందం

శిక్షణలో భాగంగా ఎర్రాతివారిపల్లెలో సెంట్రల్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం మంగళవారం పర్యటించింది. - 8లో

## న్యూస్‌రీల్

### న్యుమోనియాపై పకడ్బందీగా అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

**చిత్తూరు కలెక్టరేట్ :** న్యుమోనియా వ్యాధి లక్షణాలను ప్రజలకు తెలియజేసేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో న్యుమోనియా వ్యాధి అవగాహన కార్యక్రమం పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో న్యుమోనియా వ్యాధి అవగాహన కార్యక్రమాలను వచ్చే ఏడాది ఫిబ్రవరి 29వ తేదీ వరకు నిర్వహించాలన్నారు. ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు. 0 నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లల్లో ఎక్కువగా వ్యాధి లక్షణాలు కనిపిస్తుంటాయన్నారు. న్యుమోనియా లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్సకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రభావతీదేవి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి రవిరాజు, తదితరులు పాల్గొన్నారు.

### కాణిపాకం హుండీ ఆదాయం రూ.1.20 కోట్లు



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ వెంకటేశు

**కాణిపాకం(యాదమరి):** కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారికి హుండీ కానుకల ద్వారా రూ.1.20 కోట్లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వెంకటేశు తెలిపారు. గత 20 రోజులుగా ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం ఉదయం ఆలయ ఆస్థాన మండపంలో లెక్కించారు. ఇందులో 12 గ్రాముల బంగారం, 2.20 కిలోల వెండి, గో సంరక్షణ హుండీ ద్వారా రూ.5 వేలు, విదేశీ కరెన్సీ 6,045 యూఎస్‌ఏ డాలర్లు, 5 ఆస్ట్రేలియా డాలర్లు, 20 ఇంగ్లాండ్ పౌండ్స్, 20 కెనడా డాలర్లు, 30 సింగపూర్ డాలర్లతో కలిపి మొత్తం రూ.1.20 కోట్లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, హరిమాధవ రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్ బాబు, హుండీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి, ఆలయ సిబ్బంది, కాణిపాక యూనియన్ బ్యాంక్ శాఖ అధికారులు పాల్గొన్నారు.


### 19న ఓపెన్ స్కూల్ ఓబీఈ పరీక్ష

**చిత్తూరు కలెక్టరేట్ :** ఓపెన్‌స్కూల్ విధానంలో విద్యనభ్యసించే అభ్యర్థులకు ఓపెన్ బేసిక్ ఎడ్యుకేషన్(ఓబీఈ) లెవల్ ఏ, బీ, సీ వార్షిక పరీక్షలు ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్నట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) ఓబీఈ వార్షిక పరీక్షలు జిల్లా కేంద్రంలోని కొంగారెడ్డి మున్సిపల్ హైస్కూల్‌లో లెవల్ ఏ,బీ అభ్యర్థులకు 19వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. లెవల్ సీ అభ్యర్థులకు రెండు సబ్జెక్టుల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షలు ఎంఈఓ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలకు హాజరయ్యే ఆశావర్కర్లకు హాల్‌టికెట్లను డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 65 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు డీఈఓ వెల్లడించారు.

### పలమనేరు సబ్ డీఎఫ్‌ఓగా వేణుగోపాల్

**చిత్తూరు కార్పొరేషన్:** పలమనేరు సబ్ డీఎఫ్‌ఓగా సి.వేణుగోపాల్‌ను నియమిస్తూ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు మధుసూదనరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన అనంతపురం సర్కిల్ బుక్కపట్నం రేంజర్‌గా ఉన్నారు. ఉద్యోగోన్నతిపై చిత్తూరు జిల్లాకు రానున్నారు.

### నాణ్యత లోపిస్తే చర్యలు



పనులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

**చిత్తూరు కలెక్టరేట్:** భవన నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో స్పందన భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్పందన భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. పీఆర్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఫలరాజం.. నాణ్యతే లక్ష్యం

మధుర ఫలం మామిడి.. అందుకే ఫలరాజుగా ఖ్యాతి. ఇది ఉద్యాన రంగానికే తలమానికం. వేసవి తాపాన్ని తగ్గించే తీపి ఫలం. జిల్లాలో ఈ పంట విస్తారంగా పండుతోంది. అయితే కొన్ని సందర్భాల్లో ఎగుమతికి ఆంక్షలు ఎదుర్కొంటోంది. ఈ స్థితిని అధిగమించి.. ఫలరాజం.. నాణ్యమైన దిగుబడి సాధనే లక్ష్యంగా ఉద్యానవన శాఖ సమాయత్తమవుతోంది. ఇందుకు సేంద్రియ విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తోంది.





మామిడి తోట

- సేంద్రియ విధానంతో మంచి దిగుబడికి చర్యలు
- సాగుపై రైతులకు విస్తృత అవగాహన
- యాజమాన్య పద్ధతులపై సదస్సులు

**సాక్షి, చిత్తూరు:** జిల్లాలో ఉద్యాన వన పంటల్లో మామిడిదే అగ్రస్థానం. మామిడికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉంది. అయితే రసాయన ఎరువులు వాడడంతో దిగుబడుల్లో క్రిమిసంహారక అవశేషాలు అధికంగా ఉండి, నాణ్యత దెబ్బతింటోంది. ఫలితంగా ఎగుమతులకు నోచుకోకుండా పోయే ప్రమాదం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో రసాయన ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువులు పెంచి నాణ్యమైన అధిక దిగుబడి సాధించేందుకు జిల్లా యంత్రాంగం సమాయత్తమైంది. అంతర్జాతీయస్థాయిలో మామిడి ఎగుమతి చేయాలన్న లక్ష్యంతో జిల్లా ఉద్యానవన శాఖ సదస్సుల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తోంది.

**22 మండలాల్లో మామిడిదే అగ్రస్థానం**

జిల్లాలోని 31 మండలాల్లో మొత్తం 13 లక్షల ఎకరాల భూమి ఉంది. అందులో మామిడి పంట 68 వేల హెక్టార్లలో సాగవుతోంది. అందులో 22 మండలాల్లో మామిడి సాగు ప్రధానంగా ఉంది. చిత్తూరు, ఐరాల, పూతలపట్టు, తవణంపల్లె, బంగారుపాళెం, పలమనేరు, పుంగనూరు, గుడిపాల, యాదమరి, పెనుమూరు, గంగాధర నెల్లూరు, శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం, రొంపిచెర్ల, పులిచెర్ల, సదుం, సోమల, చౌడేపల్లె, పెద్దపంజాణి, వి.కోట, రామకుప్పం, గంగవరం, బైరెడ్డిపల్లె మండలాల్లో ఎక్కువగా సాగువుతోంది.

**తోతాపురిదే అగ్రస్థానం**

జిల్లాలో సాగవుతున్న మామిడి మొత్తం విస్తీర్ణంలో 46,566 హెక్టార్ల సాగుతో తోతాపురి అగ్రస్థానంలో ఉంది. 10,275 హెక్టార్లలో బేనిషా(బంగినపల్లి), 6,755 హెక్టార్లలో నీలం, 4,883 హెక్టార్లలో మల్లిక, కాలేపాడు, హిమామ్‌పసంద్, పులిహోర, జవేరి రకాలు సాగు చేస్తున్నారు.

**మార్కెటింగ్ సౌకర్యం..మస్తు**

జిల్లాలో మామిడి విక్రయానికి మార్కెటింగ్ సౌకర్యం బాగా ఉంది. దామలచెరువులోని మ్యాంగో నగర్, చిత్తూరు, బంగారుపాళెం, పుత్తూరు, పలమనేరు ప్రాంతంలో మార్కెట్ యార్డులు ఉన్నాయి. తోతాపురి రకం తప్ప మిగిలినవి ఎక్కువగా తినడానికి ఆహారప్రియులు ఇష్టపడతారు. వీటిని ఇతర ప్రాంతాల వ్యాపారులు జిల్లాకే వచ్చి కొనుగోలు చేస్తుంటారు.

**180 రోజుల పంట**

సాధారణంగా వాతావారణ పరిస్థితులకు అనుగుణంగా 180 రోజుల్లో ఈ పంట కోతకు వస్తుంది. ఉష్ణోగ్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో మరో 20 నుంచి 30 రోజులు అధిక సమయం పడుతుంది. టేబుల్ రకం పిలిచే మామిడి ఎక్కువగా తినడానికి ఉపయోగపడుతుంది. స్థానిక అవసరాలు పోను మిగిలిన సరుకును యూరోపియన్ దేశాలతోపాటు మరికొన్ని దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. అలాగే చిత్తూరు జిల్లా నుంచి ఢిల్లీ, కోల్‌కతా, మహారాష్ట్ర, అసోం, కర్ణాటక, తమిళనాడుకు అత్యధికంగా ఎగుమతి అవుతోంది.

**దశలవారీగా అవగాహన సదస్సులు**

మామిడి పంటపై జిల్లాలోని రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా ఉద్యానవన శాఖ అధికారులు, రైతులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించడం, అధిక దిగుబడి సాధించడం, రసాయన ఎరువులు తగ్గించడం, సేంద్రియ ఎరువులు పెంచటంతోపాటు యాజమాన్య పద్ధతులపై సదస్సులు నిర్వహిస్తున్నారు. రసాయనాలు లేని మామిడి ఎగుమతే లక్ష్యంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

### 34 పరిశ్రమల్లో గుజ్జు తయారీ.. ఎగుమతి

ఉమ్మడి జిల్లాలో 34 గుజ్జు పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల ద్వారా ఉత్పత్తి చేస్తున్నారు. ఆ మామిడి గుజ్జు ఇతర దేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు. తోతాపురి రకం మామిడి మొత్తం గుజ్జు తయారీకే ఉపయోగిస్తారు. ఈ గుజ్జు జిల్లాలో 7.5 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. ఇతర ప్రాంతాల వారు కూడా తమ మామిడి ఇక్కడికి తీసుకొచ్చి గుజ్జు తయారు చేసుకుని, ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. సాధారణంగా ఎక్కువ క్రిమిసంహారక మందులు వాడడంతో ఇతర దేశాల వారు ఇక్కడి మామిడి కొనుగోలుకు వెనకడుగు వేస్తున్నారు. ఈ పరిస్థితి అధిగమించడానికి ఉద్యానవన శాఖ కృషి చేస్తోంది.

### నాణ్యతతోనే పరిశ్రమలకు మనుగడ



మామిడి పంటలో నాణ్యతపైనే పల్ప్ పరిశ్రమల మనుగడ ఆధారపడి ఉంది. జిల్లాలో పల్ప్ పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. మామిడి పంటకు రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడి నాణ్యమైన పంట దిగుబడులు సాధించాల్సి ఉంది. అప్పుడే అంతర్జాతీయ స్థాయిలో మామిడి గుజ్జు ఎగుమతికి వీలుంటుంది. దీంతో పల్ప్ పరిశ్రమకు కూడా మనుగడ ఉంటుంది.

– తలపులపల్లి బాబు రెడ్డి, రైతు, జ్యూస్ ఫ్యాక్టరీ యజమాని

### ఎప్పటికప్పుడు సూచనలు



జిల్లాలో ఉద్యాన పంటలు ఎక్కువగా ఉన్నందున ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు నిరంతరం సలహాలు సూచనలు ఇస్తున్నాం. క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా మామిడి నాణ్యతను తీర్చిదిద్దాలని అవగాహన కల్పిస్తున్నాం. తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంట దిగుబడి సాధిస్తేనే రైతులకు లాభదాయకం.

– కోటేశ్వరరావు, ఉద్యానవన సహాయ సంచాలకులు

### సూచనలు పాటిస్తే మంచి దిగుబడి



రైతులు మామిడి సాగులో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చు. క్షేత్రస్థాయిలో ఎటువంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఉన్న ఉద్యానవన శాఖ సిబ్బందిని క్షేత్రానికి తీసుకెళ్లి సమస్యను వారికి చెప్పి వెంటనే పరిష్కరించుకోవాలి. వారి సూచనల మేరకు తక్కువ మోతాదులో హానికరం కాని క్రిమిసంహారక మందులు వినియోగించాలి.

– మధుసూదనరెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి

### రైతులకు సహకారం



రాష్ట్ర ప్రభుత్వం మామిడికి గిట్టుబాటు ధరలు కల్పించి, రైతులకు సహకారం అందిస్తోంది. మామిడి సాగులో ఖర్చు తగ్గించుకోవడానికి తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించాం. ఆ మేరకు వారు క్షేత్రస్థాయిలో రైతులతో సమావేశాలు నిర్వహించి, అనుమానాలను నివృత్తి చేయాలి.

– సగిలి షణ్మోహన్, జిల్లా కలెక్టర్

### సేంద్రియం.. తక్షణ కర్తవ్యం



మామిడి సాగులో సేంద్రియ విధానం అవలంభించడమే తక్షణ కర్తవ్యం. సేంద్రియ ఎరువులు వాడితే ఖర్చులు కూడా తగ్గుతుంది. ఈ పద్ధతి ఒకరే కాకుండా క్షేత్రస్థాయిలో సామూహికంగా పాటిస్తే కొంతవరకు తెగుళ్ల నివారించవచ్చు. సేంద్రియ ఎరువుల వాడకంతో పంట దిగుబడి అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వస్తుంది. దీంతో మంచి ధరలను పొందే అవకాశం ఉంటుంది. రైతులకు మంచి లాభం వస్తుంది.

– డాక్టర్ బీఎస్ రెడ్డి, ఉద్యానవన యూనివర్సిటీ మాజీ చాన్స్‌లర్

# చల్లని ఫ్యాన్ గాలి లాంటి పాలన అందిస్తున్నాం

- తమిళంలో మాట్లాడి..అదరగొట్టిన మంత్రి ఆర్కే రోజా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్కేరోజా

**నగరి :** 'చల్లని ఫ్యాన్ గాలి లాంటి పాలన అందిస్తున్నాం.' అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని చింతలపట్టెడలో ఏపీ వై నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చింతలపట్టెడ సచివాలయ పరిధిలోని రెండు వార్డుల్లోనే రూ.27.48 కోట్ల సంక్షేమం, అభివృద్ధి జరిగిందన్నారు. మధ్యతరగతి నేత కార్మికులు ఎక్కువగా నివశించే ఈ ప్రాంతంలో 900 నివాసాలుంటే 672 మందికి పింఛన్ అందుతోందన్నారు. ప్రజలు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. 'నాలుగేళ్ల క్రితం ఇలాంటి సంక్షేమం అందిందా? పాఠశాలలు ఎలా ఉండేవి? ఆస్పత్రిలో వసతులు ఎలా ఎండేవి? ఇంటింటికీ వచ్చి ఏమికావలని ఎవరైనా అడిగారా? ఇంటి పట్టాలు అందాయా? గడపగడపకు మంత్రులు విచ్చేశారా? ఇలా ప్రశ్నించుకుంటే మీ మనస్సే మంచి చేసిందెవరో.' చెబుతుందన్నారు. తమిళనాడులో నేత సామాజిక వర్గానికి 500 యూనిట్లు విద్యుత్ ఉచితంగా ఇస్తున్నారని, మనకెందుకు ఇవ్వడం లేదని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. అలా చెప్పే వారు ఎందుకు వారి పాలనలో ఇవ్వలేదో ఒక్క నిమిషం ఆలోచించాలన్నారు. తమిళనాడులో రెండు నెలలకు 500 యూనిట్లు ఉచితంగా ఇస్తూ నెలకు రూ. వెయ్యి మాత్రమే పింఛన్ ఇస్తున్నారన్నారు. ఇక్కడ నెలకు రూ. 2,750 పింఛన్ ఇస్తున్నామన్నారు. రెండు నెలలకు అది రూ.5500 వస్తుందన్నారు. ఇదిగాక విద్యుత్ బిల్లులో 50 శాతం సబ్సిడీ వస్తుందన్నారు. గత ప్రభుత్వం కేటగిరి మార్చిన కారణంగా వచ్చిన అదనపు చార్జీలనుకూడా ప్రభుత్వం త్వరలో తొలగిస్తుందన్నారు. గత నాలుగేళ్లలో ఇన్ని మంచి పనులు చేశామని ప్రజలకు టీడీపీ నాయకులు చెప్పుకోగలరా అని ప్రశ్నించారు. చల్లని ఫ్యాన్ గాలి లాంటి ఈ పాలన ఇలానే కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటువేసి ముఖ్యమంత్రిగా జగనన్నను, ఎమ్మెల్యేగా తనను గెలిపించుకోవాలంటూ తమిళంలో మాట్లాడుతూ మంత్రి అదరగొట్టారు.

**జనం బాగుండాలంటే జగనన్న సీఎంగా ఉండాలి**

జగనం బాగుండాలంటే ..జగన్ ముఖ్యమంత్రిగా ఉండాలని మంత్రి ఆర్కేరోజా అన్నారు. మంగళవారం మండలంలోని గుండ్రాజుకుప్పం సచివాలయపరిధిలో ఆమె ఏపీ వై నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ ప్రాంగణంలో నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిని చూపే డిస్ప్లేబోర్డును, గ్రామంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒక వైపు సంక్షేమం.. మరోవైపు అభివృద్ధి సమపాళ్లలో జరుగుతోందన్నారు.

### గుండ్రాజుకుప్పం దళితవాడలో పల్లెనిద్ర

ఏపీ వై నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా గుండ్రాజుకుప్పం దళితవాడలో మంగళవారం రాత్రి ఆమె బస చేశారు. గ్రామంలో సమస్యలపై ప్రజల్లో ఒకరై కూలంకుషంగా అందరితో చర్చించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పల్లెనిద్ర చేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు నళిని, భూపాలన్, మురుగ, ఆనంద్‌కుమార్, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, ఢిల్లీ, పార్టీ మండల కన్వీనర్ సుదర్శన నాయుడు, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ హరి, సర్పంచ్ బాలప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



పల్లెనిద్ర చేస్తున్న మంత్రి ఆర్కే రోజా

### ఓవర్‌హెడ్ ట్యాంకులు పరిశుభ్రంగా ఉంచాలి

**చిత్తూరుకలెక్టరేట్:** జిల్లాలోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. పంచాయతీ, మున్సిపల్ శాఖ అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీలోపు అన్ని ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో బ్లీచింగ్ వేసి, శుభ్రం చేయాలన్నారు. గ్రామ స్థాయిలో తాగునీటి పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో డ్రైనేజ్, కాలువల వద్ద బ్లీచింగ్ పౌడర్‌చల్లాలన్నారు. ట్యాంకులను శుభ్రం చేసిన తర్వాత సంబంధిత సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఈఓపీఆర్డీల సంతకాలతో నివేదికను సిద్ధం చేసి ఈ నెల 25 లోపు కలెక్టరేట్‌కు పంపాలన్నారు. జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ లక్ష్మి, డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి, డీఎల్‌డీఓ రవికుమార్ పాల్గొన్నారు.

### శ్రీవారి దర్శనానికి 12 గంటలు

**తిరుమల :** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 70,902 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 22,858 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.24 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

# ఆడుదాం ఆంధ్రాకు ఏర్పాట్లు చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

**చిత్తూరు కలెక్టరేట్ :** రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రీడాపోటీల నిర్వహణకు నిర్దేశించిన శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. డిసెంబర్ 15 నుంచి 2024 జనవరి 21వ తేదీ వరకు క్రీడాపోటీలు నిర్వహించాలని చెప్పారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పోటీలు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పోటీలు నిర్వహిస్తోందన్నారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీల్లో ఆసక్తి ఉండి, 15 ఏళ్లు నిండిన వారు పాల్గొనవచ్చని చెప్పారు. ముందస్తుగా పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ సమీక్షలో జేసీ శ్రీనివాసులు, సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ, చీఫ్ కోచ్ బాలాజీ, డీఈఓ విజయేంద్రరావు, డీఎస్పీ శ్రీనివాస్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సహకార రంగంలో విశిష్ట సేవలు

**చిత్తూరు అగ్రికల్చర్:** సహకార రంగం విశిష్ట సేవలు అందించి, అన్ని రంగాలను ఆదుకుంటోందని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆవరణలో డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ ఆధ్వర్యంలో సహకార బ్యాంకు జెండాను ఆవిష్కరించి, సహకార వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమ కాలం నుంచి నేటి వరకు సహకార సంఘాల పాత్ర ఎంతో ప్రధానమైందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న చర్యలతో సహకార సంఘంలోని బ్యాంకులు నేడు ప్రైవేటు బ్యాంకులతో సమానంగా ముందుకు దూసుకెళుతున్నాయన్నారు. 2019లో రూ.వెయ్యి కోట్ల లావాదేవీలున్న జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రస్తుతం రూ.3 వేల కోట్ల లావాదేవీలకు చేరుకుందన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ రైతులు, సామాన్య ప్రజలకు సహకార సేవలు మరింత అందుబాటులోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. ఏటా సహకార వారోత్సవాల నిర్వహణ కార్యక్రమం బ్యాంకుల అభివృద్ధికి మరింత దోహదపడుతుందని రాష్ట్ర సహకార బ్యాంకు ఉద్యోగుల సంఘం యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలీఅక్బర్ బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి బ్రహ్మానందరెడ్డి, కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి, డీసీసీబీ సీఈఓ మనోహర్ గౌడ్, రిజిస్ట్రార్ వనజ, డెయిరీ అధికారి రవిచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

# నేనొస్తున్నాని..శుభ్రం చేశారా?

- జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఏపీవీపీ కమిషనర్ వెంకటేశ్వర్లు తనిఖీలు
- పలు సేవలపై అసంతృప్తి
- ల్యాబ్ విభాగం సిబ్బందిపై ఆగ్రహం


స్కానింగ్‌కు వచ్చిన వ్యక్తులతో మాట్లాడుతున్న ఏపీవీపీ కమిషనర్ వెంకటేశ్వర్లు

**చిత్తూరు రూరల్:** 'నేనొస్తున్నానని.. ఆస్పత్రిని శుభ్రం చేశారా?' అని జిల్లా ఆస్పత్రి నిర్వాహకులను ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. సాక్షి దినపత్రికలో ప్రచురితమైన సేవలు మరిచి.. అనే కథనంలోని అంశాల ఆధారంగా విచారణ ప్రారంభించారు. ఆస్పత్రిలోని పలు విభాగాలను సందర్శించారు. తొలుత ఓపీలోని రోగులను విచారించారు. తర్వాత స్కానింగ్ విభాగాన్ని పరిశీలించి అక్కడి సమస్యలు, అందుతున్న సేవలపై ఆరా తీశారు. స్కానింగ్ కోసం వచ్చిన వ్యక్తులతో కాసేపు మాట్లాడారు. ఆస్పత్రిలో ఎదుర్కొంటున్న స మస్యలపై విచారించారు. అలాగే ల్యాబ్‌లోని సిబ్బందిపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఎన్ని రకాల టెస్టులు చేస్తున్నారని?, ఏ రకంగా చేస్తున్నారని ప్రశ్నించారు. దీంతో అక్కడ పనిచేసే సిబ్బంది పొంతనలేని సమా ధానం ఇచ్చారు. అడిగే ప్రశ్నలకు ఎందుకు సగం మా త్రమే జవాబు ఇస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ల్యాబ్ సిబ్బంది గుటకలు మింగారు. తీరా ఆస్పత్రి నిర్వాహకులు కల్పించుకుని కమిషనర్‌ను సర్దుబాటు చేశారు. తర్వాత ప్రసూతి విభాగంలోని చిన్న పిల్లల వార్డును సందర్శించారు. ఈ క్రమంలో మరుగుదొడ్డిని పరిశీలించి తానొచ్చననే కదా శుభ్రం చేయించారని ప్రశ్నిస్తూ.. మరుగుదొడ్డి నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

**లోపాలైతే ఉన్నాయి!**

తనిఖీల అనంతరం ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడారు. 2017–18లో జరిగిన ఎంఓయూ ప్రకారం అపోలో యాజమాన్యం ప్రభుత్వాస్పత్రిని నడిపిస్తోందన్నారు. ఒప్పందం ప్రకారం ఆస్పత్రిలో సేవలు అందుతున్నాయా..? లేదా అనే అంశంపై తాము పరిశీలన చేశామన్నారు. ఓపీలతోపాటు పలు విభాగాలను తనిఖీ చేసి వారికి అందుతున్న వైద్య సేవల అమలు, ల్యాబ్ పరీక్షల నిర్వహణపై పూర్తి స్థాయిలో విచారించామన్నారు. ఈక్రమంలో అపోలో నిర్వాహకులు ఒప్పందం ప్రకారం సేవలు అందించడంలో కొన్ని లోపాలను గుర్తించామన్నారు. కరెంట్ సమస్యలు, మందులు, మాత్రలు, తాగునీటి సమస్యలు, ఆరోగ్య శ్రీ కేసులను కూడా రెఫర్ చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. మందులు మాత్రలు బయటకు రాయిస్తున్నారని కూడా రోగులు చెప్పారన్నారు. ప్రభుత్వం అందించిన ల్యాబ్ పరీక్ష పరికరాలను వాడుకోలేకపోతున్నారన్నారు. బడ్జెట్ అంశంపై చర్చించి సమస్యలు రాకుండా చూస్తామన్నారు. పారిశుద్ధ్యం లోపిస్తోందన్నారు. ఈ తనిఖీలో గుర్తించిన అంశాలపై ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తామన్నారు. అనంతరం అపోలో, ప్రభుత్వ వైద్యాధికారులతో కమిషనర్ సమావేశమయ్యారు. బడ్జెట్, ల్యాబ్ పరీక్ష ముడిసరుకు కొనుగోలు, మందులు, మాత్రలు బయటకు రాసి ఇవ్వడం, పోస్టుమార్టంలో ఎందుకు అపోలో వైద్యులు లేరని, అత్యవసర విభాగంలో ఎందుకు ప్రభుత్వ వైద్యులు కేటాయించలేదనే విషయంపై చర్చించారు. చివరగా శుక్రవారం ఆస్పత్రి నిర్వాహకులు విజయవాడకు రావాలని ఆయన సూచించారు. వైఎస్సార్ యూహెచ్ఎస్ వైస్ చాన్సలర్ బాబ్జి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ నరసింహులు, ఇన్‌చార్జ్ డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి, సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, ఆర్ఎం సంధ్య, అపోలో నిర్వాహకులు నరేష్ కుమార్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

**సర్దేశారు..**

కమిషనర్ రాకను పసిగట్టిన ఆస్పత్రి నిర్వాహకులు ఆస్పత్రిని పకడ్బందీగా సర్దేశారు. అత్యవసర విభాగాన్ని పూర్తిగా మార్చేశారు. ఇంజెక్షన్ ఇస్తున్న గదిలో కొత్తగా పడకలు వేశారు. వాహనాల పార్కింగ్‌ను కట్టడి చేశారు. అక్కడక్కడ గోడలకు రంగులు పూశారు. కొత్తగా బోర్డులు పెట్టేశారు. కాగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కూడా ఆస్పత్రిలో హడావుడి నెలకొంది. దీనిపై స్వచ్ఛంద సంస్థలు కూడా కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశాయి.

# ఆనందం తోడుగా...చిన్నారుల వేడుక


చిత్తూరు: బాలల దినోత్సవంలో పాల్గొన్న ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

**చిత్తూరు కలెక్టరేట్ :** నగరంలోని పలు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

**విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి**

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ కరుణకుమార్ అన్నారు. మంగళవారం డీఈఓ కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం పిల్లలకు కల్పించిన హక్కులు, చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. డీఈఓ విజయేంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి మార్గదర్శకులు కావాలన్నారు.

**క్రీడలపై మక్కువ పెంచుకోవాలి**

విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి అన్నారు. నగరంలోని జైహింద్ మున్సిపల్ పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దిందన్నారు. అనంతరం విద్యార్థులకు నోటుపుస్తకాలు, విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. కో ఆప్షన్ సభ్యులు అను, కార్పొరేటర్ సయ్యద్, శ్రీధర్, అన్బు, అల్తాఫ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

# పుస్తక పఠనంతో జ్ఞానం


జెండా వందనం చేస్తున్న మధుబాల

**చిత్తూరు కార్పొరేషన్:** నిత్యం పుస్తక పఠనంతో జ్ఞానం లభిస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ మధుబాల తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం చిత్తూరులో గ్రంథాలయ భవనం వద్ద ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత జాతీయ జెండాకు వందనం చేసి, అనంతరం దేశ తొలి ప్రధానమంత్రి నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిత్తూరులో గ్రంథాలయ భవనానికి నిధులు మంజూరయ్యాయని చెప్పారు. విద్యార్థులతో నగరంలో ర్యాలీ నిర్వహించారు. శర్మ, లలిత, మధుబాబు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

# ఎర్రాతివారిపల్లెలో కేంద్ర బృందం



సచివాలయాన్ని సందర్శిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

**సదుం:** శిక్షణలో భాగంగా సెంట్రల్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం ఎర్రాతివారిపల్లెలో మంగళవారం పర్యటించింది. సచివాలయంలో అందిస్తున్న సేవలను ఆరా తీసింది. ప్రభుత్వం సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేసి స్థానికంగానే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు డీఎల్‌పీఓ హరప్రసాద్ వారికి తెలిపారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనులు పరిశీలించారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు. తరువాత పాఠశాలలో జరిగిన నాడు–నేడు పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించారు. వారికి అందిస్తున్న మధ్యాహ్న భోజన వివరాలను తెలుసుకున్నారు. బృంద సభ్యులు సత్యంగురావ్, షైనీ ప్రియదర్శిని, అంకిత సిన్హా, ధీరజ్ కుమార్, శశాంక్ జైన్, సురభ్‌మీనా, ఎంపీడీఓ వరప్రసాద్, ఎంఈఓ శ్రీరాములు, ఉపాధి ఏపీడీ శ్రీనివాసులు, సర్పంచ్ కళావతి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

# జాతీయ వాలీబాల్ జట్టుకు చౌడేపల్లె విద్యార్థి


నిరంజన్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

**చౌడేపల్లె:** జాతీయ స్థాయి వాలీబాల్ అండర్ –14 పోటీలకు చౌడేపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థి నిరంజన్ ఎంపికైనట్లు ఆ స్కూలు హెచ్‌ఎం నాగరాజారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిట్రెడ్డిపల్లెకు చెందిన నిరంజన్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో వతరగతి చదువుతున్నాడని చెప్పారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు విశాఖపట్నం అరకులో జరిగిన అంతర్ జిల్లాల (రాష్ట్రస్థాయి పోటీల్లో) ప్రత్యేక ప్రతిభ చూపారన్నారు. దీంతో అతడు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. రాష్ట్రస్థాయి జట్టులో ప్రాతినిథ్యం వహిస్తూ డిసెంబరు 22 నుంచి 26వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో నిరంజన్ పాల్గొంటారన్నారు. క్రీడాకారుడిని హెచ్‌ఎం, పీడీ రామచంద్ర, పీఈటీ రాజేంద్ర అభినందించి, సత్కరించారు.

**జాతీయస్థాయి వాలీబాల్ బాలికల జట్టుకు అనుశ్రీ**


అనుశ్రీ

జాతీయస్థాయి వాలీబాల్ బాలికల జట్టుకు మర్రిమాకులపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థిని అనుశ్రీ ఎంపికైనట్లు ఆ స్కూలు హెచ్‌ఎం నాథముని నాయుడు తెలిపారు. ఇటీవల విశాఖపట్నం అరకులో జరిగిన అంతర్‌జిల్లాల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో తలపడగా జాతీయస్థాయి జట్టుకు అనుశ్రీ ఎంపికైనట్లు పేర్కొన్నారు. అనుశ్రీని హెచ్‌ఎం, పీడీ పవన్‌కుమార్ అభినందించారు.